
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024



ఉచిత మెగా వైద్య శిబిరం

జిల్లాలో నేడు

ఆమనగల్లు , నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నై శంకరన్ ఆస్పత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఐఓఎల్ ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు.

కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యం

- రహదారులను ఆక్రమించి వడ్లు ఆరబోస్తున్న అన్నదాతలు
- ధాన్యం రాశులను ఢీకొని ప్రమాదాలు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు

6



లక్ష్యం... వంద శాతం

- పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు
- పాఠ్యాంశాల రివిజన్‌తో సందేహాలు నివృత్తి
- ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించి పరిశీలన

5



ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగం

- సెర్ప్, ఎస్‌బీఐ అధికారుల విచారణ
- అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు, డ్వాక్రా సంఘాల మహిళలు
- మల్కీజ్‌గూడ గ్రామంలో ఉద్రిక్తత

5



చలి పంజా

గజగజ వణుకుతున్న జనం

- రాత్రి వేళల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉమ్మడిజిల్లాలో 12.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో చలి ఉధృతి రోజు రోజుకూ పెరుగుతోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈ సీజన్‌లో 12.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మూడు రోజులుగా చలిగాలుల తీవ్రత పెరిగి పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి, రంగారెడ్డిజిల్లా చందన్వెల్లిలో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 12.2 డిగ్రీలు, కోట్‌పల్లిలో 12.4, వికారాబాద్‌లో 12.7డిగ్రీల, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంలో 12.2 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాబాద్‌లలో 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో 13.8 డిగ్రీలు, కుత్బుల్లాపూర్, శామీర్‌పేటలో 14.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత ఇంకా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పగటిపూట ఎండలు బాగానే ఉంటున్నప్పటికీ సాయంత్రం తరువాత చలి తీవ్రత పెరుగుతోంది. చలి పంజా విసురుతుండంతో రాత్రి వేళల్లో బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ప్రజలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలిని తట్టుకునేందుకు స్వెటర్‌లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో జ్వరం, జలుబు, దగ్గున బారిపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.



ఆట స్థలాలుగా పంట పొలాలు

క్రీడామైదానంగా మారిన మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలోని పొలం

అమ్ముకోవడం ఇష్టం లేక మైదానాలుగా మార్పు

నేల తల్లినే నమ్ముకున్న రైతుకు పొలమే ఆధారం. అమ్మలాంటి సాగు భూమిని రియల్ వ్యాపారుల పరం చేసేందుకు మనసు రాక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. పచ్చని పంట పొలాలను క్రీడలకు అద్దెకిస్తూ ఆదాయం పొందుతున్నారు. దీంతో పంటలతో కళకళలాడిన పొలాల్లో క్రీడామైదానాలు దర్శనమిస్తున్నాయి. ఉద్యోగం, సంపాదనలో శ్రమించే నగరవాసులు వారాంతాల్లో నగర శివారులోని మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లోని పంటపొలాల్లో వెలిసిన క్రీడామైదానాల్లో ఆటపాటలతో సందడి చేస్తూ సేదతీరుతున్నారు.

- అద్దెకు ఇస్తూ ఆదాయం గడిస్తున్న రైతులు
- మొయినాబాద్‌లో భారీగా వెలుస్తున్న గ్రౌండ్లు
- వారాంతాల్లో నగరవాసుల సందడి

మొయినాబాద్ రూరల్, నవంబరు18: పచ్చని పంటలకు వేదికగా ఉన్న పొలాల్లో క్రీడా మైదానాలు వెలుస్తున్నాయి. నీటి కొరత, గిట్టుబాటు ధరలు లేక కొందరు రైతులు పొలాలను అమ్ముతుండగా మరికొందరు వాటిని క్రీడా మైదానాలుగా మార్చుకొని ఆదాయాన్ని గడిస్తున్నారు. కోటి జనాభా ఉన్న భాగ్యనగరంలో సరిపడా క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేటు క్రీడా మైదానాలకు డిమాండ్ పెరిగింది. నగరంలోని పలు పేరున్న విద్యా సంస్థల్లో మాత్రమే క్రీడా స్థలాలు ఉన్నాయి. వీటితో పాటు అకాడమీల్లో

మిగతా 6వ పేజీలో...



మైదానాల ఏర్పాటు అభినందనీయం

రైతులు తమ పంట పొలాలను అమ్ముకోకుండా క్రీడామైదానాలను ఏర్పాటు చేస్తుండడం వల్ల నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చేందుకు ఈ మైదానాలు దోహదం చేస్తాయి. నగరంలో క్రీడా మైదానాలు లేకపోవడంతో శివారులోని ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆటలు ఆడేందుకు మంచి అవకాశం లభిస్తుంది.

- రాజు గౌడ్, క్రీడాకారుడు, ఎన్కేపల్లి

ముగిసిన గ్రూప్- 3 పరీక్షలు



శ్రీఇందు కాలేజీలోని పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

రంగారెడ్డి అర్బన్/ ఇబ్రహీంపట్నం/ మొయినాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 3 పేపర్లకు ఈ పరీక్షలు జరిగాయి. ఆదివారం రెండు పేపర్లకు పరీక్షలు నిర్వహించగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 34,526 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 16,654 మంది హాజరయ్యారు. 17,872 మంది గైర్హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం పరిధిలో 13,388 మంది అభ్యర్థులకు గాను 6,737 మంది హాజరయ్యారు. మొయినాబాద్ మండలంలో 6,726 మంది అభ్యర్థులకు గాను 1,733 మంది హాజరయ్యారు. అలాగే అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో 8,580 మంది అభ్యర్థులకు 4,809 మంది హాజరు కాగా... సరూర్‌నగర్ పరిధిలో 5,832 మంది అభ్యర్థులకు గాను 3,375 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అధికారులు విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సి. నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారుల పనితీరు మార్చుకోవాలన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు ఆలస్యంగా హాజరు కావడంపై సీరియస్ అయ్యారు. సమయపాలన పాటించాలన్నారు. కిందిస్థాయి సిబ్బందిని పంపిస్తే ఊరుకునేది లేదన్నారు. ఫీల్డులో వారంలో మూడు రోజులు కచ్చితంగా వెళ్లి కింది స్థాయిలో శాఖ పనితీరును పరిశీలించాలన్నారు. ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అంతకుముందు ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ అంశాలకు సంబంధించి 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్, డీఆర్వో సంగీత, ఏవో సునీల్, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత విద్యను అందించాలని వినతి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగార్జున, రంజిత్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించి ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రతీ గ్రామంలో ఆధునిక ఆసుపత్రి నిర్మించాలని, అర్హులైన వారికి సాగునీటి సౌకర్యంతో ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలని, అలాగే 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరారు.



వ్రతశోభితం.. బుగ్గక్షేత్రం

దక్షిణ కాశీ బుగ్గ రామలింగేశ్వర క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. కార్తీక సోమవారం పరమేశ్వరుడికి ప్రీతిపాత్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.

మంచాల, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేపడుతున్న దివ్యాంగులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆసరా పింఛన్ దారులను రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేస్తుందని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆసరా పింఛన్ దారులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత గీత కార్మికులకు, బీడీ కార్మికులకు 4వేల పెన్షన్ పెంచుతామని చెప్పి మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నవంబరు 18 నుంచి 23వరకు అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతామని, స్పందించకుంటే నవంబరు 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించి తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ల బాబు, జిల్లా అధ్యక్షులు కరంటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు యాచారం జంగయ్య, గువ్వల యాదయ్య, మద్దెల బాలరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము రాములు, పల్ల శంకర్, జిల్లా నాయకులు చాకలి ఉపేందర్, దేరంగుల ఈశ్వర్, పల్నాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1.33 కేజీల బంగారం చోరీ

- 80తులాల వెండి, రూ.2.5 లక్షల నగదూ మాయం
- రెండు రోజుల్లో పెళ్లి.. ఇంట్లో భారీ దొంగతనం



దొంగతనం జరిగిన ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పెళ్లి ఇంట్లో భారీ చోరీ జరిగింది. 133 తులాల(1.33కేజీల) బంగారు ఆభరణాలు, 80తులాల వెండి నగలు, రూ.2.50 లక్షల నగదు మాయమైంది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి శంకర్‌పల్లి పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శంకర్‌పల్లి బల్దియా కౌన్సిలర్ పార్శి రాధా, బాలక్రిష్ణ కూతురు పెళ్లి ఈనెల 20(బుధవారం) రోజున జరగాల్సి ఉంది. 17వ తేదీ ఆదివారం పెళ్లి సంబరాల్లో భాగంగా హల్దీ కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం మెహందీ కార్యక్రమం సైతం పూర్తి చేసుకుని మహిళలు రాత్రి వంటిపై ఉన్న నగలు పెట్టేందుకు అల్మారాను తెరిచారు. దీంతో అల్మారాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులంతా లబోదిబోమన్నారు. అర్ధరాత్రి 12:30లకు శంకర్‌పల్లి పోలీసులకు పెళ్లి కూతురు తండ్రి పార్శి బాలక్రిష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, నార్సిగి సీఐ హరిప్రసాద్ రెడ్డి, శంకర్‌పల్లి ఎస్సై సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు. నగలు పెట్టిన గదిలోనికి ఎవరెవరు వెళ్లారనే విషయాలపై ఆరాతీశారు. క్లూస్ టీంతో పాటుగా ఫింగర్‌ప్రింట్ వారిని రప్పించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శత చండీ హోమం

కడ్తాల్ , నవంబర్ 18: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం అమ్మవారికి బోనాలు, బండ్ల కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా భక్తులు ఒడిబియ్యం పోసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో చేపట్టిన శతచండీ హోమంలో తహసీల్దార్ ఆర్‌పీ జ్యోతిఅరుణ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పద్మశ్రీ, శ్రీనివాస్ రెడ్డి సునీత దంపతులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్‌ట్రస్టీ శిరోలి పంతూ, ఈవో స్నేహలత, యాట నర్సింహ్మా, రామావత్ భాస్కర్, శేఖర్ గౌడ్, తులసీరామ్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు అలైన్‌మెంట్‌తో రైతులకు తీవ్ర నష్టం

తిమ్మాపురంలో నిరసన.. కలెక్టర్‌కు వినతి



తిమ్మాపురంలో ఫ్యూచర్ సిటీకి రోడ్డు మార్కింగ్ చేసిన స్థలంలో నిరసన తెలుపుతున్న తిమ్మాపురం రైతులు

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ వరకు దక్షిణ భాగంలో రోడ్డు అలైన్‌మెంట్ కారణంగా తీవ్రంగా నష్టపోతామని తిమ్మాపురం, రాచులూరు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిమ్మాపురంలో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ విమానాశ్రయం నుంచి కందుకూరు మండలం మీర్కాన్‌పేట, బేగరికంచ గ్రామాలలో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోతో కూడిన 330ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం అధికారులు మూడు దిశల నుంచి సర్వేచేసి చివరగా విమానాశ్రయం నుంచి కొంగరకలాన్, రాచులూరు, తిమ్మాపురం గ్రామాల మీదుగా బేగంపేట, తుర్కగూడ, గాజులబురుజు తండాల మీదుగా మీర్కాన్‌పేట వరకు రోడ్డు వేయడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. అయితే ఆయా గ్రామాలో భూసేకరణ విషయంలో పరిహారం గురించి ప్రభుత్వం ఇప్పటివరకు రైతులతో చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ రోడ్డు వేయడానికి 441ఎకరాలు అవసరం కాగా, అందులో 100ఎకరాలకు పైగా సన్న, చిన్నకారు రైతులు 200మంది తమ వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు భూమికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మీనర్సింహారెడ్డి, సామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో యాలాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

యాలాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి పోటీల్లో యాలాల మండల విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాణించారు. ఖమ్మంలో అండర్-14 విభాగంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యాలాల ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వి.శివకుమార్ రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచాడు. అదేవిధంగా బాలికల విభాగంలో జి.అర్చన 6వ స్థానం, సి.నందిని 8వ స్థానంలో నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఏపీసీ చైర్మన్ రమాదేవి అభినందించారు.

త్రిపుర సీజేను కలిసిన రాంపల్లివాసులు


న్యాయమూర్తిని సన్మానిస్తున్న రాంపల్లి వాసులు

కీసర రూరల్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో అత్యధిక కేసులు పరిష్కరించి, వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన సందర్భంగా త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. అమర్‌నాథ్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో నాగారం మున్సిపాలిటీ రాంపల్లికి చెందిన యువకులు సందీప్‌గౌడ్, హరినాథ్‌గౌడ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్


ప్యాబ్ సిటీ భూనిర్వాసితులతో మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, భూములు కోల్పోయినన ప్రతీ రైతుకు తగిన న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం జెన్నాయిగూడ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. ప్యాబ్‌సిటీ కోసం దాదాపు 20 సంవత్సరాల క్రితం అప్పటి ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కొందరు రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారని అప్పటి నుంచి పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వాలు ముందుకు రాలేదన్నారు. 2022లో టీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక నాయకుల సమక్షంలో ప్యాబ్‌సిటీ రైతులకు లేఅవుట్ చేసి ప్లాట్లు ఇస్తామని చెప్పినా ఆ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూములు కోల్పోయినన ప్రతీ రైతు కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా తాను బాధ్యత తీసుకుంటానన్నారు. అదే విధంగా జెన్నాయిగూడ గ్రామానికి గ్రామకంఠం ఏర్పాటు చేసి భూముల క్రయవిక్రయాలు జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాండురాంగారెడ్డి, నర్సింహ, మాదవరెడ్డి, యాదయ్య, భిక్షపతి, శ్రీశైలం, లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి ప్రతిపక్ష నేతల మోకాలడ్డు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో గిరిజన నాయకులు

బొంరాస్‌పేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో పూణే, ముంబై తదితర ప్రాంతాలకు వలసలను ఆపేందుకు ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపట్టాలని గిరిజన నాయకులు దేశ్యనాయక్, సంతోష్, దేవ్‌సింగ్ తదితరులు కోరారు. సోమవారం లగచర్ల పర్యటనకు వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యుడు జాత్రోతు హుస్సేన్‌నాయక్‌ను వారు తుంకిమెట్లలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా ఈ నియోజకవర్గం వెనకబాటుకు గురైందన్నారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకర్గ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో ఉండటంతో అభివృద్ధికి అవకాశం ఏర్పడిందన్నారు. కావాలనే గిరిజన బిడ్డలను పావులుగా వాడుకొని ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో చాలా మంది ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములు ఇచ్చారు. ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కావాలని బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతుందని ఆరోపించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు శంకర్‌నాయక్, రవినాయక్, బాల్యనాయక్, మోత్యానాయక్, దేశ్యనాయక్ తదితరులు ఉన్నారు.

గో సంరక్షణను బాధ్యతగా భావించాలి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ గ్రామపంచాయతీ మక్తా గ్రామంలో మార్వాడీ కమ్యూనిటీ హాల్‌లో సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన హాయ్ మాతా మందిరం, గోశాల పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో సంరక్షణకు మార్వాడీ సేవా సమాజం చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శామీర్‌పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, బీజేపీ నాయకులు సొల్లేటి కరుణాకర్, పోలగౌడ్ మహేష్‌గౌడ్, వికాస్‌గౌడ్, మార్వాడి సేవా సమాజం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఘట్‌కేసర్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. ఆమె సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో సర్వే ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివరాల సేకరణకు ప్రజలను ఒత్తిడి చేయవద్దన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సర్వే వివరాలను వెల్లడించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు ఇళ్ల వద్దకు వచ్చినపుడు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, నాయకులు మల్లారెడ్డి, బొక్క సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాల్లో హైవే పనులు ప్రారంభం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

చేవెళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు రెండు వారల్లో ప్రారంభమవుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా మండలాల బీజేపీ నాయకులు నగరంలో ఎంపీని కలిసి రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న బైపాస్ రోడ్డులోని శ్మశాన వాటిక వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ రోడ్డు పనులకు సంబంధించి ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో ఇప్పటికే మాట్లాడామన్నారు. రోడ్డు విస్తరణ పూర్తి అయితే చేవెళ్ల ప్రాంత ప్రజలతో పాటు వికారాబాద్ జిల్లా వాసులు సైతం సులభంగా రాకపోకలు కొనసాగిస్తారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు మల్లారి రమణారెడ్డి, రాందేవ్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) అనాథ పిల్లలను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చెర్కూర్ గ్రామానికి చెందిన నీలం భాగ్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5 వేలు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. భాగ్యమ్మ ఇద్దరు పిల్లలకు విద్య, ఉపాధికి చేయూతనందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కల్తీ ఆహార నిరోధానికి కమిషన్ ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్యగౌడ్, నర్సింహ్మ, శ్రీనివాస్, మైసయ్య, లాలయ్య, అలీ,రాజు, రామరాజు, యాదయ్య, రమేశ్, జంగయ్య, సుభాష్, సతీస్, పాత్లావత్‌సుమన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

అవినీతి, అక్రమాలపై విచారణకు డిమాండ్

తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్, ఏసీబీకి అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు ఆయన సోమవారం మీడియాకు తెలిపారు. మున్సిపాలిటీలో కమిషనర్ అక్రమాలకు అంతు లేకుండా పోయిందన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీ ఎదుట ఉన్న సర్వే నంబర్ 129, 130లలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, అక్రమ లేఔట్ జరుగుతుందని పేర్కొంటూ ఆగస్టు 17న ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన కమిషనర్‌పై మండిపడ్డారు. నిబంధనకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడుతూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. సర్వే నంబర్ 129, 130లో ఫిర్యాదు చేసిన అక్రమ లేవుట్ పై , అక్రమంగా నిర్మించిన షెడ్ విషయంలో కమిషనర్ ఎందుకు చర్య తీసుకోలేదో విచారణ చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతూ ప్రతిఫలాన్ని ఆశిస్తున్న తాండూరు మున్సిపల్ కమిషనర్‌పై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు.



పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలకు కొత్త టీచర్లు రావడంతో పూర్తి స్థాయిలో విద్యాబోధన సాగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠాలను రివిజన్ చేస్తూ.. అర్థం కాని పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక ప్రణాళిక

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతలు
- పాఠ్యాంశాల రివిజన్‌తో సందేహాలు నివృత్తి
- ఏ, బీ, సీ గ్రూప్‌లుగా విభజించి పరిశీలన
- తప్పులను అధిగమించేందుకు రోజువారీగా పరీక్షల నిర్వహణ



స్టడీ అవర్‌లో పదో తరగతి విద్యార్థులు

చౌదరిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో నవంబరు 1 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఇప్పటికే పూర్తి చేసిన సిలబస్‌ను రివిజన్ చేస్తూ వెనుకబడిన వారు అన్ని అంశాలపై పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కొందుర్గు మండలంలో కొందుర్గు, మూట్పూర్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పెద్ద ఎల్కిచర్ల, ఎదిర, ఇంద్రానగర్, లాల్‌పహాడ్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలున్నాయి. ఉమ్మడి మండలంలో మొత్తం 589 మంది విద్యార్థులు 2024-25 సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మండలంలో మొత్తం 8 ఉన్నత పాఠశాల ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో వచ్చిన ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఈ ఏడాదిలో మంచి ఫలితాలు సాధించాలనే తపనతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఫలితాలపై ప్రత్యేక కార్యాచరణ

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అదించడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి 9:15 వరకు, సాయంత్రం 4:00 నుంచి 5:00 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. వీటిలో ఏ రోజు ఏ సబ్జెక్టులపై తరగతులు నిర్వహించాలనే విషయంపై స్పష్టమైన టైం టేబుల్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఉదయం ఒక ఉపాధ్యాయుడు, సాయంత్రం మరొకరు వారికి సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులగా విభజించి సులువుగా పాఠ్యంశాలు అర్థమయ్యేలా విద్యను బోధిస్తున్నారు.

ఫోన్‌కాల్‌తో విద్యార్థులను నిద్రలేపి..

విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో చేసే తప్పులను గుర్తించేందుకు వారికి అవగాహన కల్పించేందుకు రోజువారీ పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. సబ్జెక్ట్ వారీగా పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు చేసిన తప్పులను వ్యక్తిగతంగా వివరించి, పునరావృతం కాకుండా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులకు నిత్యం తెల్లవారుజామునే ఫోన్‌కాల్‌తో నిద్రలేపి చదివేలా ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా కూడా సందేశాలను నివృత్తి చేస్తున్నారు.

వ్యక్తిగత శ్రద్ధతో ముందుకు..

తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధనకే పరిమితమవుతారు. దాంతో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపే అవకాశం ఉండదు. దీంతో చురుకైన విద్యార్థులు మాత్రమే ముందంజ వేస్తారు. వెనుకబడిన విద్యార్థులు అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారి కోసం ప్రత్యేక తరగతులు వరంగా మారాయనడంలో సందేహం లేదు. పిల్లల వ్యక్తిగత సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులు వారికి కేటాయించిన సమయంలో పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాలను చదువు కోవడానికిఅవకాశం కల్పిస్తారు. ప్రధానంగా గణితం, ఆంగ్లం, భౌతిక, జీవశాస్త్రాల్లో విద్యార్థులకు ఎక్కువ సందేశాలు వస్తున్నాయని, వాటిని అయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకొంటున్నారని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు.

గణితంపై దృష్టి పెట్టా..



గణితంలో నూటికి నూరు మార్కులు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నా. రేఖీయ సమీకరణాలు, త్రికోణమితి, సిద్ధాంతాలు, శ్రేణులు, బహుపదులకు సంబంధించిన లెక్కలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాను.

-మనోవిగ్నేష్, విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

తికమకపెడుతున్న భౌతిక శాస్త్రం



భౌతిక శాస్త్రంలో కొన్ని కొన్ని పాఠ్యాంశాలు తికమక పెడుతున్నాయి. ప్రత్యేక తరగతుల్లో నాకున్న అన్ని సందేహాలను నివృత్తి చేసుకుంటున్నా.. బాగా కష్టపడి పది ఫలితాల్లో మంచి గ్రేడ్ మార్కులు సాధిస్తా.

- వైష్ణవి, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, లాల్‌పహాడ్

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



గణితంలో పలు అధ్యాయాల్లోని కఠినమైన లెక్కలను విద్యార్థులు సులభంగా చేసేలా ప్రత్యేక తరగతుల్లో మెలకువలు నేర్పుతున్నాం. ప్రత్యేక తరగతుల్లో వారు మంచి మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న అంశాలపై అవగాహన కల్పిస్తు బోధన చేస్తున్నాం. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

- వాణి, గణితశాస్త్రం ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

బాలికలు మనోధైర్యాన్ని అలవర్చుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ మంగజగదీశ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలికలు మనోధైర్యాన్ని అలవర్చుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ బర్ల మంగజగదీష్ అన్నారు. ఇబ్రహీంపట్నం జడ్పీ బాలికల పాఠశాలలో సోమవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ నిర్వహించారు. మంగ మా ట్లాడుతూ ఆకస్మికంగా ఎదురయ్యే సంఘటనలను ఎదుర్కొనేందుకు బా లికలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బాలికల ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తె లిపారు. కరాటే తదితర అంశాల్లో శిక్షణ ఇ స్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జె.బాల్‌రాజ్, ప్రిన్సిపల్ లావణ్య, పీటీ సుశీల, కరాటే మాస్టర్ అశోక్ పాల్గొన్నారు.

కేఎల్లార్ ఏకపక్ష నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీకి తీవ్రనష్టం



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్‌నాయక్

మహేశ్వరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేఎల్లార్ ఏకపక్ష నిర్ణయాల కారణంగా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలహీనపడుతందని మహేశ్వరం మండల కాంగ్రెస్ సీనియర్ గిరిజన నాయకులు విటల్ నాయక్, కృష్ణానాయక్, పాండునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహేశ్వరంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మహేశ్వరం మండలానికే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కందుకూరు మండలానికి చైర్మన్ పదవిని కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మూడు పర్యాయాలు కందుకూరు మండలానికి చెందిన నాయకులకే కేటాయించారన్నారు. ఈ యేడు చైర్మన్ పదవి గిరిజనులకు రిజర్వుడు కావడంతో మహేశ్వరం మండల గిరిజన నాయకులకే దక్కుతుందనే ఆశపడ్డ వారిని కేఎల్లార్ మోసం చేశారన్నారు. ఇప్పటికైనా చైర్మన్ పదవిని మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, బిచ్యానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్



డాక్టర్ మల్లికార్జున్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా 28 అల్లైడ్ హెల్త్ సైన్సెస్‌ను కళాశాలలను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పారా మెడికల్ బోర్డు సెక్రటరీ పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(2 సంవత్సరాలు), డిప్లొమా ఇన్ డయాలసిస్ టెక్నీషియన్(2 సంవత్సరాలు) ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ చదివిన విద్యార్థులు అర్హులని, బైపీసీ విద్యార్థులు లేని పక్షంలో ఎంపీసీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపీసీ విద్యార్థులు అందుబాటులో లేకపోతే ఇతర గ్రూపుల ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల గడువును ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. వివరాలకు కాలేజీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంసీవికారాబాద్.ఓఆర్‌జీలో దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు.

విమానంలో సిగరెట్ తాగిన ప్రయాణికుడు

అదుపులోకి తీసుకున్న ఎయిర్‌పోర్టు సిబ్బంది

శంషాబాద్ రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): విమానంలో సిగరెట్ తాగిన ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టు సిబ్బంది అదుపులోకి తీ సుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అబుదాబి వి మానం బయల్దేరే ముందు ఓ ప్రయాణికుడు సిగరెట్ తాగాడు. ఇది గమనించి ఎయిర్ హోస్టెస్ పైలట్‌కు చెప్పారు. పైలట్ ఫిర్యాదుతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎయిర్‌పోర్టు సిబ్బంది తెలిపారు.



శిలాద్వారానికి పూజలు చేస్తున్న ప్రజలు

ఆలయాల శిలాద్వారాలకు పూజలు

శంకర్‌పల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండాకల్ గ్రామంలో సోమవారం మల్లికార్జున స్వామి, బీరప్ప స్వామి, కొండపోచమ్మ ఆలయాల గర్భాలయ శిలాద్వార(కడప పూజ) స్థాపన కార్యక్రమం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య నారాయణ వ్రతాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువకులు పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

పరిగి,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటిన జరుగనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని చేన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం పరిగిలో మాలల సింహగర్జనకు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలల సంఖ్య తక్కువగా ఉందనే ఆలోచనలో అన్ని రాజకీయ పార్టీలు ఉనానయని, పట్టించుకోవడం లేదని విమర్శించారు. జాగో మాలల నినాదంతో మాలలంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.వెంకటయ్య, ఆనందం, నాయకులు శివరాజు,లక్ష్మయ్య, శ్రీనివాస్, నర్సింహులు, కోళ్ళ యాదయ్య, లక్ష్మణ్, వీరేశం పాల్గొన్నారు.



పహిల్వాలన్ చెరువలో చేప పిల్లను వదులుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



నర్కుడ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

షాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని షాబాద్ పహిల్వాన్ చెరువు, చందన్‌వెల్లి చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సంవృద్ధిగా కురువడంతో చెరువులు నిండుకుండల్లా ఉన్నాయన్నారు. దీంతో చేపలు బాగా వృద్ధి చెంది పెంపకందారులకు మంచి లాభాలు వస్తాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే యాదయ్య మండల పరిధిలోని హైతాబాద్‌లో బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య అశోక్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగం, నాయకులు చేవెళ్ల స్వామి, సుభాష్‌రెడ్డి, రాహుల్, మత్స్యకారులు పాల్గొన్నారు.

శంషాబాద్ మండలంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని నర్కుడ గ్రామ సమీపంలోని చెరువులో మత్స్యకార సంఘం నాయకులతో కలిసి చేప పిల్లలను వదిలారు. నర్కుడ చెరువులో 1.38లక్షలు, గండిపేట చెరువులో 3.13లక్షల చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి

యాచారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేశారని, మినిట్స్ లేకుండా నిధులు డ్రా చేయడానికి అనుమతి ఇచ్చారని డ్వాక్రా సంఘాల మహిళలతో పాటు గ్రామస్తులు ఎస్‌బీఐ అధికారులను, సెర్ప్, అధికారులను నిలదీశారు. సోమవారం యాచారం ఎస్‌బీఐ అధికారులు, సెర్ప్, అధికారులు ఉమ్మడిగా విచారణ చేపట్టడంతో గ్రామంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన బుక్ కీపర్ రాణి గ్రామంలోని ఇందిర, గులాబి, తదితర సంఘాల సభ్యుల తీర్మానంతో పాటు ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసి వాడుకుందని డ్వాక్రా సంఘాల సభ్యులతో పాటు గ్రామస్తులు ఆరోపించారు. ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసినట్లు గుర్తించి బ్యాంక్ మేనేజర్ ఝాన్సీరాణి, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. సాయంత్రం వరకు జరిగిన విచారణలో రూ.3.12లక్షల నిధులు డ్రాచేసినట్లు విచారణలో తేల్చారు. ఆయా సంఘాల సభ్యుల సంతకాలను రాణి ఫోర్జరీ చేసి నిధులు కాజేశారని వారు వెల్లడించారు.

ఉద్రిక్త పరిస్థితుల్లో విచారణ

కాగా, మంగళవారం నుంచి ఒక్కో సంఘ సభ్యులను పిలిచి విచారణ చేస్తామని వారన్నారు. డ్రా చేసిన నిధులను తిరిగి మహిళల ఖాతాల్లో జమ చేసేదాక ఆందోళన విరమించేది లేదని మహిళలు విచారణ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి కాస్త ఉద్రిక్తతగా మారింది. కాగా రాణిపై యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశామని బ్యాంక్ మేనేజర్ వెల్లడించారు. నిధులు దుర్వినియోగంపై ప్రశ్నిస్తే పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసి ఆమె వేధింపులకు గురిచేశారని బోడ ముత్యాలు అనే వ్యక్తి అధికారుల దృష్టికి తెచ్చారు. విచారణ చేసి రాణి నుంచి నిధులు రాబట్టాలని పొదుపు సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. కాగా విచారణ సందర్భంగా పరిస్థితి అదుపు తప్పుతుండడంతో యాచారం పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తేవడంతో విచారణ సజావుగా జరిగింది. గ్రామంలో సుమారు రూ.20లక్షల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అనుమానిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

రైతులకు చెలగాటం
వాహనదారులకు ప్రాణసంకటం

● రోడ్లపై ధాన్యం ఆరబోతతో ఇబ్బందులు ● అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న వాహనదారులు



రోడ్డుపై ఎండబోసిన వడ్లు

యాచారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పొలాల వద్ద కల్లాలు లేక రైతులు తమ పంట ఉత్పత్తులను రోడ్లపై ఆరబోస్తున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ తరుణంలో వడ్లను బీటీ రోడ్లపై ఎండబోస్తూ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాలకు ఒకేసారి ఎక్కువ మంది రైతులు వడ్లు తీసుకొస్తుండంతో ఆ ప్రదేశంలో వడ్లు ఎండబోతకు స్థలం సరిపోవడం లేదు. దీంతో రైతులు గ్రామ సమీపాల్లో, వారి పొలాల పక్కన బీటీ రోడ్లను ఎండబోతకు వినియోగించుకుంటున్నారు. రోడ్డు ఆక్రమించి వడ్లు ఆరబోస్తుండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రమాదాలకూ గురవుతున్నారు. రాత్రిపూట రోడ్లపై ఉన్న వడ్ల కుప్పలను ఢీకొని ప్రమాదాలకు గురైన సంఘటనలనేకం ఉన్నాయి. నిజానికి రోడ్లపై పంట ఉత్పత్తులను ఆరబోయడం నేరం. రైతులు ఇలా చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. యాచారం మండలంలో చాలా గ్రామాల్లో బీటీ రోడ్లపై ధాన్యం ఎండబోస్తున్నారు. ఇదిలా ఉంటే గత్యంతరం లేక తాము రోడ్లపై ఓ పక్కన వడ్లు ఎండబోసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. అయితే ప్రమాదకంగా రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా క్లస్టర్‌కు భూసేకరణ అంశంపై పరిశీలించేందుకు సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బీఆర్ఎస్, గిరిజన నేతలు లగచర్లకు వెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ నేతలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. మధ్యాహ్నం విడుదల చేశారు. దశరథ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందన్నారు. గిరిజనుల భూములు లాక్కోవడం అన్యాయమని, వారికి దక్కేందుకు ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని ఆయన స్పష్టంచేశారు. అరెస్టైన వారిలో ప్యాక్స్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్, పాండు, శ్రీను, మహేశ్, అంజి, శ్రీకాంత్, రాజు, జగన్, రాజేశ్, భీమన్ నాయక్, తదితరులు ఉన్నారు.

మండల సాధనే లక్ష్యం

తలకొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలు సోమవారం 18వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మండలం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్, శరత్‌చంద్ర, జంగయ్య, శివయ్య, అల్లావుద్దీన్, కొండల్, యాదగిరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మేడపై నుంచి పడి యువకుడి మృతి

ఆదిభట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మేడపై నిద్రిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదిభట్ల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం రావిర్యాలకు చెందిన గుంటి రాజు(27) నగరంలో ఓ ప్రయివేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. రోజూ ఇంటికొచ్చి రాత్రి మేడపై నిద్రించేవాడు. ఆదివారం రాత్రి మేడపైన నిద్రించగా ఒంటిగంట సమయంలో శబ్దం వచ్చింది. కుటుంబీకులు వచ్చి చూడగా రాజు పడిపోయి మృతిచెందినట్టు గుర్తించారు. రాజు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్చురీలోనే యాదయ్య మృతదేహం : సీఐ

మాడ్గుల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాగిళ్లలో ఈ నెల 17న బావ బామ్మర్దులు పరస్పరం దాడిచేసుకున్న ఘటనలో బావ బర్కని యాదయ్య(54), బావమరిది గడ్డం శ్రీను(40) అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం శ్రీను మృతదేహాన్ని బంధువులు వారి స్వగ్రామం యాచారం మండలం మేడిపల్లికి తరలించారు. అయితే యాదయ్య మృతదేహం మార్చురీలోనే ఉందని సీఐ జగదీష్ తెలిపారు. అతడి మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు ఎవరూ రాలేదని, ఎవరూ తీసుకెళ్లకుంటే కల్వకుర్తి మున్సిపాలిటీ సిబ్బందితో మంగళవారం దహనం చేయిస్తామన్నారు. ఘటనపై నాగిళ్ల మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. ఇదిలా ఉంటే యాదయ్య భార్య హత్య కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలయ్యాడు. వారికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

కాలేజీ భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి పట్టణంలోని ఆధ్య డెంటల్ ఆస్పత్రి యజమాని డాక్టర్ రంజిత-గిరి దంపతులు సోమవారం రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న లక్ష్యంతో తలపెట్టిన కళాశాల నిర్మాణానికి విరాళమివ్వడం సంతోషకరమని డాక్టర్లను ఎమ్మెల్యే అభినందించారు.

గ్రామాల్లోనూ స్పీడ్ లిమిట్ అవసరం



బాచుపల్లిలో స్టాపర్లను ఏర్పాటు చేసిన యాలాల శ్రీనివాస్

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామీణ ప్రాంతాల్లోను వాహనాల స్పీడ్ లిమిట్లు, స్టాపర్ల ఏర్పాటు అవసరం అని బాచుపల్లి మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో లిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో సోమవారం రోడ్డుపై నాలుగు బ్యారికేడ్లను పెట్టారు. నేదునూరు నుంచి తమ గ్రామం మీదుగా పులిమామిడి వరకు డబుల్‌రోడ్డు వేయడంతో వాహనాల రద్దీ ఎక్కువైందని, వేగంగా వెళ్తున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు బ్యారికెడ్లు, స్టాపర్లు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంతం బాల్‌రెడ్డి, టి.ఆరోగ్యరెడ్డి, విజయ్, కె.అంజిరెడ్డి, ప్రభు, కుమ్మరి అంజయ్య, పి.కుమార్, శంకరయ్య, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత



నిర్మాణ మెటీరియల్ అందజేత

తలకొండపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలని మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికిచెందిన ఏవుల ఎలీషా ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ మెటీరీయల్ ను సమకూర్చారు. సోమవారం ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు ఎలీషా కుటుంబానికి మెటిరీయల్ ను అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా జానమ్మ చెరువు



సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ పరిధి జానమ్మ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.సోమవారం చెరువు బ్యూటిఫికేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2కోట్లతో చెరువును సుందరీకరిస్తామన్నారు. ఎన్ని ఆంటకాలెదురైనా అభివృద్ధి చేసే తీరతాం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ శ్రావణి, మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, నాయకులు బస్వం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నవనారసింహస్వామి ఆలయ శంకుస్థాపన

చౌదరిగూడ: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లిలో నవనారసింహాలయ శంకుస్థాపనోత్సవాన్ని పూజారి రాఘవేందర్‌జోషి, సునిల్‌జోషి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్ హోమ పూజలు చేశారు. కొందుర్గు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సత్యప్రమోద్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, అన్వర్, సలీం, బాలయ్య, బాల్‌రాజ్, పాపయ్య, గోపాల్, శ్రీను, మల్లేష్, భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గీతాఅయ్యప్ప ఆలయ రాజగోపుర నిర్మాణం

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్‌లోని శివమారుతీ గీతాఅయ్యప్ప ఆలయ రాజగోపుర నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ఎమ్మెల్యే 1.11లక్షల విరాళమిచ్చారు. గోపుర పనులను ప్రారంభించడం తన పూర్వజన్మ సుకృతమనారు. గోపురానికి 5.16లక్షల విరాళం ఇస్తానని చటాన్‌పల్లి వాసి నందారం అశోక్‌యాదవ్ ప్రకటించారు. ఇప్పటికే ఆలయ మరమ్మతుకు 9లక్షలిచ్చిన అశోక్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. తన కుమారుడు రాఘవేందర్ జ్ఞాపకార్థం ఆలయ మహాద్వారానికి తలుపులు చేయిస్తానని ఆకుల వెంకటేశం-అరుణ దంపతులు ప్రకటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నందీశ్వర్, మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్‌గౌడ్, ఎ.బస్వం, వీరేశం, ప్రవీణ్, అర్చకులు రవిశర్మ పాల్గొన్నారు.

వేద పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే

ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ శివారులోని వేద పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే శంకర్ ప్రకటించారు. పాఠశాలను సందర్శించి శివుడిని దర్శించుకొని కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్యస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రతి సోమవారం తన పేరిట శివుడికి అర్చన చేయాలని, పాఠశాల విద్యార్థుల భోజన ఖర్చులకు 1.25లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అగ్గనూరి విశాలవిశ్వం, బసవేశ్వర్, భువనేశ్వర్, సంగయ్య, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, వెంకటేష్‌గౌడ్, నందు, వీరేశ్వం, టి.శేఖర్ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం రైతులకందిస్తున్న చేయూతతో సాగు విస్తీర్ణం, దిగుబడి బాగా పెరిగాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు ఆర్థికంగా బలపడాలన్నదే ప్రభుత్వధ్యేయం అన్నారు. కడ్తాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ డైరెక్టర్, ప్యాక్స్ చైర్మన్ జి.వెంకటేశ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏడీఏ ఆదిలక్ష్మిలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగును లాభసాటిగా మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. సన్నాలకు క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తున్నట్టు చెప్పారు. బోనస్, మద్దతు ధర విషయంలో విపక్షాల మోసపూరిత మాటలను రైతులు నమ్మొద్దని కసిరెడ్డి కోరారు. కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు అమ్మాలని గంప వెంకటేశ్ రైతులను కోరారు. కార్యక్రమంలో సీఈవో దేవేందర్, ప్యాక్స్ డైరెక్టర్లు వెంకటేశ్, సేవ్య, వీరయ్య, వెంకటయ్య, ఏవో శ్రీలత, సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్, కాంగ్రెస్ జిల్లా/మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, లక్పతి,వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, జహంగిర్‌బాబ,అలీ, రామకృష్ణ, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, అస్లర్, సత్యం, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రాంచందర్,సుమన్,రాజేందర్‌గౌడ్,బిక్షపతి, ఏవో రమేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని
సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్, బుర్కుంట సతీశ్ అన్నారు. సోమవారం మల్కారం సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను అమ్మి మోసపోవద్దని, మద్దతు ధర కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మేకల ప్రభుసాగర్, కాసుల బాల్‌రాజ్, బోనగిరి సత్తయ్య, హిరేకర్ శివాజీ, మాజీ జడ్పీటీసీ తన్విరాజు, మాజీ వైస్‌ఎంపీపీ నీలామోహన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు యాదగిరిరెడ్డి, ఇస్తారి, సిబ్బంది సురేందర్, నీరటి విక్రం పాల్గొన్నారు.

కేంద్రం పరిశీలన

షాద్‌నగర్ రూరల్: ఎలికట్టలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏవో నిషాంత్‌కుమార్ పరిశీలించారు. వడ్లలో తేమ 17 శాతానికి మించకుండా ఉంటే గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 చెల్లిస్తామని తెలిపారు. సన్న వడ్లకు రూ.500బోనస్ రైతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో పాక్స్ సీఈవో రఘునందన్, ఏఈఓ తేజ్ కుమార్, హరికృష్ణ ఉన్నారు.

కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి

షాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ దేవేందర్ అన్నారు. సోమవారం సర్దార్‌నగర్ మార్కెట్‌ను సదర్శించి, ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు గురించి ఏఎంసీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సర్దార్‌నగర్ మార్కెట్‌లో వడ్లు కొనుగోలు ప్రారంభించాలని. రైతులు 20రోజుల నంచి వరి కోతలు కోసి ధాన్యం అమ్ముకోవడానికి ఎదిరుచూస్తున్నారన్నారు. రైతులు వడ్లను వ్యాపారులకు అమ్మకముందే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరసింహ తదితరులు ఉన్నారు.



సర్దార్‌నగర్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ దేవేందర్ తదితరులు

విద్యార్థులకు నైపుణ్య అవగాహన

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్‌లో సోమవారం భారత్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లకు నైపుణ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ చైర్మన్ సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొని 'సోషల్ మీడియా- ప్రభావం'పై వివరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని చెప్పారు.కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతయ్య, టీచర్లు అంజనేయులు, ఆనంద్‌కుమార్, కల్పన, పారిజాత, ఎస్ఎంసీ చైర్మన్ బూడిద మంజుల తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



తుప్పరి రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలు అధైర్యపడొద్దని, వారికి అండగా ఉంటామని ప్రజాప్రతినిధులు, నాయకులు ధైర్యం కల్పించారు. మైసిగండి టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న ట్రక్‌ను ఢీకొని మృతిచెందిన రాజు, మహేశ్‌ల మృతికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పీసీబీ మెంబర్ బాలాజీసింగ్‌లు సంతాపం తెలిపారు. కల్వకుర్తి ఆస్పత్రిలో ఎమ్మెల్యే, కడ్తాలలో శ్రీనివాస్‌రెడ్డి మృతదేహాలకు నివాళులర్పించారు. రాజు కుటుంబానికి రూ.10వేలు, మహేశ్ కుటుంబానికి రూ.5వేలు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. బాధితులను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, గంప వెంకటేశ్ పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్ చెరో రూ.10వేలు అందజేశారు. పరామర్శించిన గూడూరు భాస్కర్‌రెడ్డి,వేణుగోపాల్, వెంకటేశ్, బిక్షపతి, జహంగీర్, అలీ,రాంచందర్, కృష్ణ, రాఘవేందర్, శ్రీను, లక్ష్మయ్య, నర్సింహ, జి.యాదయ్య, అంజి, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సత్తయ్య



మాడ్గుల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సోమవారం రాష్ట్ర కో-ఆరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హైదరాబాద్‌లో కలసి సత్కరించారు. ఎమ్మెల్యే నివాసంలో సత్తయ్య, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, శేఖర్‌గౌడ్‌లు కలిసి ప్రజా సమస్యలపై విన్నవించారు. అవురుపల్లి పంచాయతీకి సొసైటీని మంజూరు చేయాలని, అలాగే గ్రామంలో సీసీరోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను సత్తయ్య కోరారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయండి



కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం భగవంత్

కేశంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి కార్యనిర్వహక కమిటీ కృషి చేయాలని కేశంపేట మండల ఏపీఎం భగవంత్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా మహిళా సమాఖ్య భవనంలో సోమవారం కార్యనిర్వహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాలలో నూతనంగా సభ్యులను చేర్చుకోవాలని సూచించారు. గ్రామ సంఘాల్లో ఇందిర మహిళా శక్తి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సభ్యులకు ప్రమాద, రుణ బీమా గురించి వివరించాలని తెలిపారు. మహిళా సమాఖ్య ద్వార ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్‌లను కుట్టి అందించే అవకాశం ఉందని, ఈ అవకాశం సభ్యులు ఉపయోగించుకోవాలని కోరారు. డ్వాక్రాబాజార్, ఎంటర్‌ప్రైజెస్ యూనిట్ల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు ఇలా ఎన్నో పనులు చేసుకునే అవకాశం మహిళా సంఘాలకు ఉందని తెలిపారు. సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి గీత, సీబీవో అడిటర్ యాదగిరి, సీసీలు రామచంద్రయ్య, నరసింహ, తిరుపతమ్మ, మల్లేష్, భూతల్లి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ సీఈవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేవెళ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఊరెళ్ల పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధించారు. సర్పంచ్ జహంగీర్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యత తత్వం అలవడుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇలియాస్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ బాలమణి, ఉపాధ్యాయులు అక్బర్, చరణ్‌తేజ్, విద్యార్థులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పేదల భూములు లాక్కొంటున్న సర్కార్

యాచారం: నాడు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేదలకు ప్రభుత్వ భూమి పంచితే.. ఆమె పేరుచెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు నేడు పేదల భూములను లాక్కొని బడాబాబులకు పంచుతూ రైతుల బతుకులు ఛిద్రం చేస్తున్నారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఫార్మాసిటీకి భూములు తీసుకోవద్దన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అధికారంలోకి రాగానే భూములు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ నేతలు ఫార్మాసిటీకి నిమ్జ్ హోదాను రద్దుచేయించాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దుచేస్తేనే రైతులు, యువత జీవితాలు బాగుపడుతాయని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

చౌదరిగూడ: బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్న ఇంద్రనగర్ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డిపై గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బిల్లుల చెల్లింపు సమయంలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ గ్రామానికి చెందిన చిట్యాల చిన్నయ్య కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చేసిన పనులకు బిల్లులు అడిగితే లంచం అడుగుతున్నారని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కులం పేరుతో దూషిస్తున్నారని, 'ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..' అంటూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని తెలిపారు. కార్యదర్శిపై చర్యలు తీసుకొని బిల్లులు ఇవ్వాలని కోరామన్నారు.

క్రీడలు ప్రతిభను బయటకు తీస్తాయి

మొయినాబాద్ రూరల్: విద్యా సంస్థల్లో నిర్వహించే క్రీడలు, ఇతర పోటీల ద్వారా విద్యార్థుల్లోని ఉన్న ప్రతిభ బయటకొస్తుందని పల్లవి ఇంటర్‌నేషనల్ విద్యా సంస్థల సీఈవో యశస్వి అన్నారు. హిమాయత్‌నగర్‌లో విద్యా సంస్థలో మూడు రోజులుగా జరుగుతున్న స్పోర్ట్స్, ఆర్ట్స్ ప్రదర్శన పోటీలు సోమవారం ముగిశాయి. ముఖ్య అతిథి యశ్వసి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశాడు. అనంతరం విద్యతో పాటు వారిలోని నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమబద రుషి, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అభిలాష అనిష్‌నటి గీతా భాస్కర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులకు పతకాలు

చేవెళ్ల: యూత్ రోలర్ స్కేటింగ్ హైదరాబాద్ రీజనల్ స్థాయిలో నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17న జరిగిన పోటీల్లో మండల పరిధి వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 30మంది విద్యార్థులు పాఠశాల తరుపున పోటీల్లో పాల్గొనగా 13మంది గోల్డ్‌మెడల్, ఏడుగురు సిల్వర్ మెడల్, పది మంది బ్రోంజ్ మెడళ్లు సాధించారని కరస్పాండెంట్ కోరడాల నరేశ్ తెలిపారు. పాఠశాల ఓరల్ చాంపియన్షిప్‌లో రెండో స్థానంలో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21వ పశుగణన కార్యక్రమం ప్రారంభం

కడ్తాల్: ఎక్వాయిపల్లిలో సోమవారం 21వ పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. పశువైద్య అధికారి భానునాయక్ సర్వేను ప్రారంభించారు. పశుసంపదకు సంబంధించి గ్రామాల్లో వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఈ సర్వేకు రైతులు సహకరించాలని బానునాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే

ఆమనగల్లు: మండలంతో పాటు మున్సిపాలిటీలోని వార్డుల్లో కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఎన్యుమరేటర్లు ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులనుంచి వివరాలు సేకరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంపీడీవో మాధురి, తహసీల్దార్ లలిత, ప్రత్యేక అధికారి ఆదిలక్ష్మి సర్వే నిర్వాహణ తీరును పరిశీలిస్తూ ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.

శంషాబాద్ రూరల్: కుల గణన సర్వే మండలంలో కొనసాగుతోంది. పెద్దతూప్రలో మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్ తమ కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్‌లకు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, పవన్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: సర్వే త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు సూచించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు వివరాలు ఇవ్వాలని కోరారు.

ఆట స్థలాలుగా పచ్చటి పొలాలు

(3వ పేజీ తరువాయి)

సైతం మైదానాలున్నా అక్కడ అందరూ ఆడేందుకు అవకాశాలుండవు. ఔటర్ రింగు రోడ్డు అవతల చేవెళ్ల నియోజకవర్గ పరిధి మండలాల్లో రైతులు పొలాల్లో మైదానాలను ఏర్పాటు చేసి వారే నిర్వహిస్తున్నారు. మరికొందరు ఆదాయం కోసం సాగుభూములను మైదానాలకు లీజుకిస్తున్నారు. అలాగే కొందరు పొలాలను కొని ప్లే గ్రౌండ్లుగా మారుస్తున్నారు. మొయినాబాద్ మండల గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇలాంటి గ్రౌండ్లు ఉన్నాయి. నగర వాసులు వారాంతాల్లో పంటపొలాల్లో ఏర్పాటు చేసిన మైదానాల్లో ఆటలాడుతూ, పాడుతూ సేదదీరుతున్నారు.

వారాంతాల్లో సందడే సందడి

కొత్త పోకడ ఏదైనా ఐటీ ఉద్యోగుల నుంచే మొదలవుతుంది. ప్రైవేట్ మైదానాలకు డిమాండ్ కూడా వీరి నుంచే ఎక్కువ. సిబ్బందిలో వ్యాయామాన్ని ప్రోత్సహించేందుకు, వారి మధ్య సమన్వయానికి ఎంఎన్‌సీలు తరచూ క్రీడాపోటీలను నిర్వహిస్తుంటాయి. ఇందుకోసం ప్రైవేట్ మైదానాలను లీజుకు తీసుకుంటున్నాయి. ఐటీ ఉద్యోగులు, కాలేజీల విద్యార్థులు, కొందరు స్నేహితులతో వారంతాల్లో క్రికెట్ ఆడేందుకు ఈ గ్రౌండ్లకు వస్తున్నారు. ప్లే గ్రౌండ్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. శనివారం, ఆదివారం రోజుల్లో నగర శివారు ప్రాంతమం సందడిగా మారుతోంది.

ఒక్కో మ్యాచ్‌కు రూ.10వేల చార్జీ

క్రీడా మైదనాలు ఎక్కువగా మొయినాబాద్ మండల గ్రామాల్లో ఏర్పాటయ్యాయి. నగరం నుంచి మైదానాలకు చేరుకునేందుకు అరగంటే పడుతుండడంతో ఎక్కువ మంది వస్తున్నారు. హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, బాకారం, నాగిరెడ్డిగూడ, మూర్తుజగూడ, అమ్డాపూర్, సురంగల్, శ్రీరాంనగర్, చిలుకూరు, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, మోత్కుపల్లి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో క్రీడామైదానాలు ఏర్పాటయ్యాయి. నిర్వాహకులు రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మైదానానికి నెలలో రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నట్టు తెలుస్తోంది. పంటల కంటే ఇదే ఎక్కువ లాభదాయకంగా ఉండడంతో రైతులు పొలాలను మైదానాలుగా మార్చేందుకు వెనకాడడం లేదు. మైదానాల్లో క్రికెట్ ఆడేవారు మ్యాచ్‌లకు ఉదయం రూ.5వేలు, మధ్యాహ్నం, సాయంత్రం రూ.3వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇదిలా ఉంటే వారాంతాల్లో మాత్రం ఒక్కో మ్యాచ్‌కు రూ.10వేల డిమాండ్ ఉంటోంది.

క్రీడా మైదానాల్లో పలు రకాల సేవలు

తొలుత పొలాలను క్రీడా మైదానంలా అభివృద్ధి చేసినా ఆటగాళ్ల డిమాండ్ మేరకు ఇతర సేవలనూ కల్పిస్తున్నారు. ఆటలాడిన తర్వాత సేదదీరేందుకు ఈత కొలనులు కట్టిస్తున్నారు. క్రీడాకారులు నృత్యాలు చేసేందుకు వీలుగా డ్యాన్స్ ఫ్లోర్, సౌండ్ సిస్టం సమకూరుస్తున్నారు. రాత్రి పూట బసచేసేందుకు వీలుగా వసతి గృహాలుంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆహారాన్ని కొన్ని మైదానాల్లో క్రీడాకారుల కోరిక మేరకు అల్పాహారం, మాంసాహారం, శాఖాహార భోజనాలు, పండ్ల రసాలు, టీ, కాఫీ, సాఫ్ట్‌డ్రింక్‌లు సరఫరా చేస్తున్నారు.

లాభదాయకంగా ఉంది

నాకు ఎన్కేపల్లిలో 12ఎకరాల భూమి ఉంది. అప్పట్లో వ్యవసాయం చేసేవాళ్లం. ప్రస్తుతం పెట్టుబడి పెరిగి గిట్టుబాటు కావడం లేదు. దీంతో పొలాలను అమ్ముకోలేక క్రీడా మైదానాలుగా మారుస్తున్నాం. 10ఎకరాల్లో వ్యవసాయం మానేసి మూడు క్రికెట్ మైదానాలను ఏర్పాటు చేశాను. వీటిద్వారా ఆదాయం బాగానే వస్తోంది. రైతులు తమ భూములను అమ్ముకోకుండా ఇలా మైదానాలుగా మారిస్తే ఆదాయాన్ని గడించొచ్చు.

– భీమేందర్‌రెడ్డి, క్రికెట్‌మైదానం యజమాని, ఎన్కేపల్లి